క్లుప్తంగా

ఏకగ్రీవంగా స్టోర్స్ డైరెక్టర్ల ఎంపిక

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కన్స్యూమర్ కో ఆపరేటివ్ స్టోర్స్ డైరెక్టర్లుగా ఐదుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్టోర్స్ చైర్మన్ వేమూరి సామ్రాట్‌కుమార్ గురువారం తెలిపారు. గతంలో పని చేసిన డైరెక్టర్ల పదవీకాలం ముగిసింది. మరలా డైరెక్టర్ల ఎన్నిక జరపాల్సి ఉండగా.. పోటీకి ఎవ్వరు లేకపోవడంతో కొత్తగా మరో ఐదుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. వార్డు నంబర్లు 2, 9, 19, 24, 25 కు సందడి రమేష్, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి, యర్రంశెట్టి వెంకట నాంచారయ్య, డాక్టర్ అబ్దుల్ కలాం, కొండెపాటి మోహనరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ఆఫీస్ బ్యారర్లుగా మరో ఐదుగురిని ఎన్నుకున్నామని చెప్పారు.

ఇంధనం ఆదా చేసిన డ్రైవర్లకు పారితోషికాలు



ఆటోనగర్(విజయవాడతూర్పు): ప్రతి నెలా ఇంధనం ఆదా చేసిన ఆర్టీసీ డ్రైవర్లకు పారితోషికం అందజేస్తున్నట్లు ఆటోనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కె.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. స్థానిక డిపో ఆవరణలో సెప్టెంబర్ నెలకు సంబంధించి ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లకు ఆయన గురువారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ప్రతి నెలా డ్రైవర్లు చాకచక్యంతో బస్సును నడిపి ఇంధనం పొదుపు చేస్తున్నారన్నారు. ఇక్కడ పనిచేసే డ్రైవర్లు ఆర్టీసీకి ఆదాయం తీసుకువచ్చే విధంగా ఇష్టపడి పని చేయాలని చెప్పారు. వీరి సేవలను సంస్థ గుర్తించి ప్రోత్సాహకాలు అందజేస్తోందన్నారు. అనంతరం ఇంధనం పొదుపు చేసే విధానాలపై డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ క్రికెట్ లీగ్‌కు సిద్ధార్థ స్కూల్ విద్యార్థుల ఎంపిక



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఈ నెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న నేషనల్ క్రికెట్ లీగ్‌కు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక అయ్యారని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య తెలిపారు. నేషనల్ క్రికెట్ సెలెక్షన్స్ అండర్-14 లెవల్‌లో కె.పూజిత్, ఆర్.శివ, హిత్‌జైన్, వై.ఆదిత్య ఉదయ్, ఎ.లిఖితాక్స్, అండర్-16 విభాగంలో జె.గౌతమ్, ఎ.ప్రణయ్, వైవీ.శ్రీమంత్ ఎంపికయ్యారన్నారు. తాడేపల్లిగూడెంలోని ఎక్సన్స్ అకాడమీలో ఈ ఎంపికలు జరిగాయన్నారు. నేషనల్ క్రికెట్ లీగ్‌కు ఎంపికైన విద్యార్థులను స్కూల్ ఆవరణలో వైస్ ప్రిన్సిపాల్ మేరీ, కోచ్ డి.భీమారావు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

సామాజిక భవన్ నిర్మాణ పనుల పరిశీలన



మధురానగర్(విజయవాడసెంట్రల్): రజక కల్యాణ మండపాన్ని అన్ని వసతులతో పూర్తి చేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి తెలిపారు. స్థానిక దుర్గాపురంలో నిర్మాణంలో ఉన్న చిట్యాల ఐలమ్మ సామాజిక భవన్ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇక్కడ రజకుల ఆకాంక్షలకు అనుగుణంగా సామాజిక భవన్ నిర్మిస్తున్నామన్నారు. అనంతరం నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశించిన సమయంలో పనులు పూర్తిచేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం ఎమినిటీ కార్యదర్శి విజయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్.రామకృష్ణ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కొండాయగుంట రాము, బ్రహ్మదేశం వసంతకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ



అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీ గురువారంతో ముగిసింది. 53వ డివిజన్‌లోని పోతిన పాపయ్య వీధిలో నివసిస్తున్న మొల్లేటి మంగకు వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ కోమలి అందజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆరోగ్యాంధ్రప్రదేశ్ స్థాపనే ధ్యేయంగా సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్యే విష్ణు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- 57వ డివిజన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



57వ డివిజన్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్)/పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని, ప్రతి వ్యక్తిని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచడమే లక్ష్యంగా... ఆరోగ్యాంధ్రప్రదేశ్ స్థాపనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. గురువారం మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన 57వ డివిజన్‌లోని 237 వార్డు సచివాలయం న్యూరాజరాజేశ్వరి పేటలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి.. వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. ఇప్పటికే వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, గృహసారథులు, కన్వీనర్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ, ప్రతి గడపను సందర్శిస్తున్నట్లు చెప్పారు. సర్వే ద్వారా ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి.. వారందరికీ క్యాంపు నిర్వహించే సమయంతో కూడిన టోకెన్లు అందజేస్తున్నారన్నారు.

14 రకాల పరీక్షలు..

శిబిరంలో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులతో కలిపి మొత్తం నలుగురు డాక్టర్లు అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రికి సిఫార్సు చేసి.. ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారని తెలిపారు. ప్రతి క్యాంపు వద్ద రోగులకు 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులను ఉచితంగా అందిస్తామని తెలియజేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు ప్రాధాన్యతనిచ్చి వారిని వెంటనే పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. శిబిరానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. అనంతరం డివిజన్‌లో పర్యటించి గతంలో జేఎన్‌యూఆర్ఎం పథకంలో 57వ డివిజన్‌లోని న్యూరాజరాజేశ్వరిపేటలో కేటాయించిన గృహాలకు రోడ్లు, డ్రెయినేజీలు సరిగ్గా లేవని వెంటనే వాటి మరమ్మతు పనులకు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. గడప గడపలో వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని స్థానికులకు ఆయన భరోసా ఇచ్చారు. సెంట్రల్‌లో తొలి శిబిరం ఇందిరానాయక్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహిస్తున్నామని, స్థానిక ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగిసిన సర్వే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ప్రజలందరూ పాల్గొని తమ ఆరోగ్య సమస్యలకు పరిష్కారం పొందాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ఇప్పటికే అన్ని వార్డుల్లోని ప్రజలందరిని సందర్శించి వారి ఆరోగ్య సమస్యల వివరాలను వలంటీర్లు సర్వే చేశారన్నారు. వారందరిని ఆరోగ్య శిబిరానికి పంపామని చెప్పారు. కార్యక్రమంలో 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సెక్రటరీలు, నాయకులు కాళ్ల ఆదినారాయణ, ఇసరపు రాజు, పఠాన్ నజీర్ ఖాన్, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రేమ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):పోలీసు, మున్సిపల్, ట్రాన్స్‌పోర్ట్, నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ .ఢిల్లీరావు ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన బ్లాక్ స్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి ప్రమాదాలకు గల కారణాలు, నివారణకు చేపట్టాల్సిన చర్యలపై కమిటీ నివేదిక సమర్పించాలని కలెక్టర్ కోరారు.గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అయా శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు,ప్రమాదాలను అరికట్టాలన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినప్పటికీ ఇంకా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు.

111 బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు..

నగరపాలక సంస్థ పరిధిలో 29, జాతీయ రహదారి పరిధిలో 55, ఆర్అండ్‌బీ పరిధిలోని 5 ప్రాంతాలతో కలిపి మొత్తం 89 ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మరో 22 ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించామన్నారు. వీటిని పునఃపరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రమాదాలు తరచూ జరిగే ప్రాంతానికి సంబంధించి ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని డీటీసీ పురేంద్రను ఆదేశించారు. కమిటీ సభ్యులు బ్లాక్ స్పాట్లను తనిఖీ చేసి 15 రోజుల్లోగా నివేదికలు సమర్పించాలన్నారు. విజయవాడ నగరంలో మరో 14 చోట్ల సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సి ఉందని, వాటిని సత్వరమే ఏర్పాటు చేయాలని చెప్పారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే హోర్డింగ్స్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహించడం వలన ట్రాఫిక్ ఇబ్బంది కలుగుతుందన్నారు. ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ విభాగం, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బందితో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగించాలన్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీసీపీ ఎం.సత్తిబాబు, డీటీసీ పురేంద్ర పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

సీఎం జగన్ ప్రభుత్వంపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే విష్ణు



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, మున్సిపల్ కమిషనర్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఎక్కడకు వెళ్లిన ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. 57వ డివిజన్ 237వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవీతో కలిసి ఆయన పాల్గొన్నారు.

384 గడపల సందర్శన

న్యూరాజరాజేశ్వరిపేట అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి 384 గడపలను సందర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో ప్రజలకు జరిగిన మేలును వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అపార్ట్‌మెంట్ వాసులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలకు చాలా వరకూ శాశ్వత పరిష్కారం చూపామని, రానున్న రోజుల్లో ఈ ప్రాంతాన్ని ఒక మోడల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వీలైనంత త్వరలో పూర్తి చేస్తామని, చేతుల మారిన ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్యను సైతం పరిష్కరిస్తామని తెలిపారు.

పవన్ పర్యటన అట్టర్ ఫ్లాప్

జనసేన అధినేత పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలని ఎమ్మెల్యే విష్ణు సూచించారు. 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన పార్టీని రూపాయి పావలా అని మాట్లాడటం సరికాదని.. ఆయన వ్యాఖ్యలు ప్రజాతీర్పును అవహేళన చేసేలా ఉన్నాయని మండిపడ్డారు. టీడీపీ – జనసేన కలయికపై ప్రజలు పూర్తిగా విరక్తి చెందారని.. 2019లో వచ్చిన తీర్పే ఇందుకు నిదర్శనమన్నారు. మరో వైపు సామాన్య, పేద కుటుంబాల విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేలా.. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తుంటే పవన్‌కళ్యాణ్‌కు ఎందుకంత కడుపుమంట అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పవన్ సభలు పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అయ్యాయని, పవన్ మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని లేనిపక్షంలో 2019లో మాదిరిగానే 2024లో కూడా ఘోరపరాభావాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఈ ప్రభాకర్ రావు, ఈఈ(ఇంజినీరింగ్) శ్రీనివాస్, ఈఈ(పార్కులు) ఏఎస్ఎన్ ప్రసాద్, డీఈలు గురునాథం, రామకష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు కాళ్ల ఆదినారాయణ, పఠాన్ నజీర్ ఖాన్, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రేమ్, అలీ, చిట్టెమ్మ, రజియా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వార్డు వలంటీర్లకు ఇంటర్వ్యూలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలకసంస్థ పరిధిలోని ఆయా వార్డు సచివాలయాల పరిధిలోని ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఇంటర్వ్యూలు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. ఆయా వార్డులకు సంబంధించిన దరఖాస్తుదారులు చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలోని జోనల్ కమిషనర్ చాంబర్లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, ఇంటర్వ్యూలు హాజరయ్యేవారు తమ అర్హత, ధ్రువీకరణ పత్రాలతో రావాలన్నారు. వివరాలకు స్పెషల్ అధికారి 81859 33187 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 48 మందికి జైలు, జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం 1వ, 2వ, 4వ, 5వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 48 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని పలు న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టగా, సంబంధిత న్యాయమూర్తులు వారికి జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. వారిలో ఒక వ్యక్తికి 15 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి 13 రోజులు జైలు, రూ.10వేలు జరిమానా, ఒక వ్యక్తికి 10 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఇద్దరు వ్యక్తులకు 05 రోజులు జైలు, రూ. 10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి 03 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఇద్దరు వ్యక్తులకు 02 రోజులు జైలు, ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి ఒక రోజు జైలు, రూ.10 వేలు జరిమానా, ఆరుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున జరిమానా, మిగిలిన 33 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

సమాజ అభివృద్ధిలో గురువుల పాత్ర ఎనలేనిది



మధురానగర్(విజయవాడసెంట్రల్): సమాజ అభివృద్ధిలో గురువుల పాత్ర ఎనలేనిదని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. స్థానిక దుర్గాపురంలో అంతర్జాతీయ టీచర్స్ డే సందర్భంగా బీఆర్టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె గురువుల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాల ఉపాధ్యాయులు సూర్యప్రభ, కల్యాణి, మాణిక్యంలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కె.రాము, బి.వసంతకుమార్, జి.ఏడుకొండలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉపాధ్యాయ రంగంలో సేవలందిస్తున్న ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో గుంటూరు ప్రధాన కార్యాలయంగా నిర్వహిస్తున్న కె.వి.ఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రతిభా పురస్కారాల మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు లెక్కకు మించి నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ప్రధానంగా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు నాడు-నేడు పేరుతో పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిందన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ 2008 నుంచి నిర్వహిస్తున్న ఈ ట్రస్ట్ కార్యక్రమాలు ఎన్టీఆర్ జిల్లాలో చేయడం ఇదే ప్రథమన్నారు. విద్యా రంగానికి సేవ చేయటం, విజ్ఞానంతో కూడిన సమాజ స్థాపనకు తోడ్పడుతున్న ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహించడం తమ సంస్థ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా పలు కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె.శ్రీనివాసరావు, సుందరయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రోజాపై టీడీపీ వ్యాఖ్యలు జుగుప్సాకరం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్లు, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర క్యాబినేట్‌లో మహిళా మంత్రిగా ఉన్న రోజాపై టీడీపీ నేత బండారు సత్యనారాయణ వ్యాఖ్యలు జుగుప్సాకరమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బండారు వ్యాఖ్యలను ఖండిస్తూ సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సింగ్‌నగర్ అమెరికన్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా తరలివెళ్లారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో పాటు వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. డౌన్ డౌన్ టీడీపీ.. డౌన్ డౌన్ బండారు అంటూ నినాదాలు చేశారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆడపడుచుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా బండారు సత్యనారాయణ, అయ్యన్నపాత్రుడు మాట్లాడుతుంటే ఏవిధంగా సమర్థిస్తున్నారని ప్రశ్నించారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో మహిళలకు ఏనాడూ సముచిత స్థానం, గౌరవం లభించలేదని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ ఆరోపించారు. నగర మహిళా అధ్యక్షురాలు పిల్లి కృష్ణవేణి మాట్లాడుతూ టీడీపీ నేతలకు మహిళలంటే మొదటి నుంచి చులకనభావమని.. వారితో ఎలా ప్రవర్తించాలో కూడా పచ్చ నేతలకు తెలియదని నిప్పులు చెరిగారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షాహినా సుల్తానా, పెనుమత్స శిరీష, ఇసరపు దేవి, ఉద్దంటి సునీత, బాలి గోవింద్, శర్వాణి మూర్తి, కొంగితల లక్ష్మీపతి, నాయకులు ఉమ్మడి వెంకట్రావు, అలంపూరు విజయ్, ఇసరపు రాజు, యరగొర్ల శ్రీరాములు, అఫ్రోజ్, గుండె సుందర్ పాల్, మోదుగుల గణేష్, యక్కల మారుతి, తోపుల వరలక్ష్మి, త్రివేణి రెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్లలో నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): జగనన్న గృహ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి, పేదలందరికీ జగనన్న ఇళ్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన హౌసింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లతో సమీక్షించారు.

నగరానికి సంబంధించి లే అవుట్లలో లబ్ధిదారుల వివరాలు, గృహ నిర్మాణాల పురోగతి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, హౌసింగ్ పీడీ, కాంట్రాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం నేర్చుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ నేతలు మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని, మహిళలపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని వైఎస్సార్ సీపీ నగర మహిళ అధ్యక్షురాలు పిల్లి కృష్ణవేణి హెచ్చరించారు. స్థానిక మధురానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆమె మాట్లాడారు. టీడీపీ నేతలకు మహిళలంటే గౌరవం లేదన్నారు. మంత్రి ఆర్కే రోజాపై టీడీపీ నేతల వాఖ్యలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. టీడీపీ నేతలకు మహిళల పట్ల గౌరవం లేకపోవటం వల్లే టీడీపీ నుంచి దివ్యవాణి, సాదినేని యామినిశర్మ, కవిత సహా అనేక మంది మహిళలు పార్టీని వీడారని గుర్తు చేశారు. టీడీపీ నేతలు సంస్కారం నేర్చుకోవాలని లేని పక్షంలో మహిళల ఆగ్రహాన్ని రాబోయే ఎన్నికల్లో మరోమారు చూపించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. టీడీపీ నేత బండారుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మానవత్వం చాటిన గుణదల పోలీసులు



వృద్ధురాలితో గుణదల పోలీసులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుణదల పోలీసులు మానవత్వం చాటుకున్నారు.గుణదల ఉలవచారు కంపెనీ సమీపంలో వివస్త్రగా ఉన్న వృద్ధురాలిని చేరదీసి నూతన వస్త్రాలు ఇవ్వటంతో పాటు ఆశ్రమంలో చేర్పించారు. వివరాల్లోకి వెళితే గుణదల ఉలవచారు కంపెనీ సమీపంలో ఒక వృద్ధురాల ఉందని గుణదల పోలీసులకు సమాచారం అందింది. దీంతో గుణదల పోలీసులు వృద్ధురాలి వద్దకు చేరుకున్నారు. ఆమె తన వివరాలు తెలియచేయలేని స్థితిలో ఉంది. దీంతో ఆమెకు వెంటనే నూతన వస్త్రాలు, ఆహారం అందించి ఆశ్రమంలో చేర్పించారు. సదరు వృద్ధురాలి వివరాలు సేకరించి వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

హైమాస్ట్ లైటింగ్‌కు శంకుస్థాపన



హై మాస్ట్ లైటింగ్‌కు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ తిరుపతమ్మ

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రికలో నగరపాలక సంస్థ సుమారు 3 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసే హైమాస్ట్ పవర్ లైటింగ్ సిస్టమ్‌కు 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికుల అభ్యర్థన మేరకు నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఐమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విలేజి కండ్రికలో ప్రతి సమస్యను పరిష్కరించడానికి ఎమ్మెల్యే మల్లాది విష్ణు పూర్తిగా సహకరించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత విలేజి కండ్రికలో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.3.40 కోట్లతో కండ్రిక నుంచి ఎస్ఎస్ బోస్‌నగర్ వరకు నిర్మించే రోడ్డు అభివృద్ధి – విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. గొల్లపూడి కాల్వ వద్ద ఒక వంతెన, కండ్రిక కరకట్ట వద్ద మరో వంతెన నిర్మాణం కూడా చేపడుతామన్నారు. కార్యక్రమంలో డివిజన్ కో ఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, నాయకులు యరగొర్ల శ్రీరాములు, సొసైటీ చైర్మన్ ఎం.రవీంద్రరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు దేవిరెడ్డి మంగారెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి, సాదం శ్రీనివాసరావు, సాదం వెంకటేశ్వరరావు, మరీదు వీరయ్య, బెజవాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామలింగేశ్వరపేట శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తాన్న పూర్ణచంద్రరావు తెలిపారు. స్థానిక ఆలయంలో గురువారం శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ కార్యదర్శి సున్నపు లక్ష్మీనరసారెడ్డి, కోశాధికారి కూచిభొట్ల పూర్ణయ్యశాస్త్రి, మోతే దుర్గారావు, డి.రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

14 నుంచి ముగ్గురమ్మల దసరా మహోత్సవాలు

విజయవాడకల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి ఆదేశాలతో ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు ముగ్గురమ్మల దసరా మహోత్సవాలు శివరామకృష్ణ క్షేత్రంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఠ సంప్రదాయాన్ని అనుసరించి బాల త్రిపుర సుందరి, శారదాంబ ,మహాలక్ష్మి అమ్మవార్లకు వివిధ అలంకారాలతో పూజాదికాలు నిర్వహిస్తామన్నారు.